క్లుప్తంగా

రోడ్లకు మరమ్మతు చేపట్టాలి



బుంగను పరిశీలిస్తున్న నాయకులు

కుంటాల: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వంతెనలు, రోడ్లకు త్వరితగతిన మరమ్మతు చేపట్టాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ పేర్కొన్నారు. మండలంలోని అందకూర్ అలుగు వద్ద ఏర్పడ్డ బుంగను సోమవారం పరిశీలించారు. మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటావార్ దశరథ్, నాయకులు ఉన్నారు.

కార్యదర్శిపై ఫిర్యాదు

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల పొలాల అమావాస్య పండుగ ఉన్నందున వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిని తొలగించాలని కోరారు. దుల్లె వెంకటేశ్, గంగారాం తదితరులు ఉన్నారు.

పాఠశాలలో మన ఆత్మగౌరవం

లక్ష్మణచాంద: మన పాఠశాల–మన ఆత్మగౌరవం అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారంవిద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఒక దేవాలయమని ప్రతిన బూనారు. పాఠశాల ను పరిశుభ్రంగా ఉంచుదామని, సామాజిక సేవలో భాగస్వాములవుదామన్నారు. ఎంఈవో అశోక్‌వర్మ, ఉపాధ్యాయులు సీఆర్పీ ఉన్నారు.

ప్రజావాణికి గైర్హాజరు

నర్సాపూర్(జి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీకాంత్, పీఆర్ ఏఈ క్రాంతి కుమార్, ఎంపీవో తిరుపతిరెడ్డి, విద్యాశాఖ నుంచి ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రావణ్ మాత్రమే హాజరయ్యారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు బీఆర్ఎస్ ధర్నా

నిర్మల్‌టౌన్: కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర విచారణకు కుట్రపూరితంగా రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి ఇవ్వడాన్ని నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ పరువు ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్(ఇంగ్లిష్ మీడియం) అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.బుచ్చయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అతిథి అధ్యాపక ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైనవారు ఈనెల 2న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులు, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. 3న కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఖానాపూర్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే బిల్లు అసెంబ్లీలో ఆమోదం కావడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తమైంది. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. దయానంద్, మాజిద్, తోట సత్యం, చిన్నం సత్యం తదితరులు ఉన్నారు.

పరామర్శ

ముధోల్: మండల కేంద్రంలో ఎయిర్‌ఫోర్స్ జవాన్ లక్ష్మీఈశ్వర ప్రసాద్ ఇటీవల మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులను కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ పరామర్శించారు. నాయకులు ఉన్నారు.

పేకాటస్థావరంపై దాడి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పేకాటస్థావరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి నిర్వహించారు. ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై గణేష్, సిబ్బందితో కలిసి దాడి చేసి 9 మందిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 59,950 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధ్వంసమైన పంట పరిశీలన

లక్ష్మణచాంద: బోరిగాంలో అడవిపందుల దాడిలో ధ్వంసమైన పంటలను ఏఈవో మౌనిక, ఉద్యానవన అధికారి దేవన్న సోమవారం పరిశీలించారు. ధ్వంసమైన పంటల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

శెభాష్..పొన్కల్ విద్యార్థులు



పాఠశాలలో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

- డ్యాన్స్, పెయింటింగ్స్‌లో రాణింపు
- ఆల్‌రౌండర్స్ ప్రతిభ
- సత్తాచాటి పలువురితో మన్ననలు

మామడ: ఆ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, డ్యాన్స్, పెయింటింగ్స్‌లో రాణిస్తున్నారు. ఆల్‌రౌండ్స్‌లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఇక్కడ ఎన్‌సీసీలో చేరి క్రమశిక్షణ అలవర్చుకుంటున్నారు జిల్లాలోని పొన్కల్ జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులు. జిల్లాలోనే 600 మంది విద్యార్థులతో ఈ పాఠశాల ద్వితీయ స్థానంలో ఉంది. ఉపాధ్యాయుల బోధన, ఆటల పోటీల్లో మెలకువలు నేర్పించడంతో రాణించి పాఠశాలకు గుర్తింపు తీసుకువస్తున్నారు. ఆంగ్ల ఉపాధ్యాయురాలు అర్చన శాస్త్రీయ నృత్యంలో మెలకువలు నేర్పించడంతో జిల్లాస్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటి అందరితో శెభాష్ అనిపించుకుంటున్నారు. 9వ తరగతి చదువుతున్న నందిని శాస్త్రీయ, జానపద నృత్యంలో ప్రతిభ కనబరుస్తోంది. ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన డ్యాన్స్ పోటీల్లో ప్రశంసపత్రం పొందింది.

మెలకువలు నేర్పిస్తున్నాం



విద్యార్థులకు చదువుతోపాటు డ్యాన్స్, పెయింటింగ్, ఫీల్డ్ ట్రిప్ తదితర అంశాల్లో ఉపాధ్యాయులు మెలకువలు నేర్పిస్తున్నారు. అందులో రాణిస్తూ పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు. గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలకు తమవంతు తోడ్పాటు అందిస్తున్నాం. – **మైన అరవింద్‌కుమార్, పీజీ హెచ్‌ఎం**

నిమిషాల్లోనే పెయింటింగ్

29ఎన్ఆర్ఎల్102: కలెక్టర్‌తో నిష్కల్‌రెడ్డి(ఫైల్)

గతేడాది పదో తరగతి చదివిన విద్యార్థి నిష్కల్‌రెడ్డి..ఏదైన చిత్రం చూస్తే నిమిషాల్లోనే బొమ్మ వేయడం ఇతని ప్రత్యేకత. పాఠశాలలో పోస్టర్‌మేకింగ్, చిత్రలేఖనం పోటీల్లో మెలకువలు నేర్చుకుని మండల, జిల్లాస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈయన్ను పలువురు అభినందించారు.

సీసీఎంబీ సందర్శన



మేకల కావ్య విద్యార్థినికి సైన్స్‌కు సంబంధించి ప్రాజెక్ట్ కారణంగా హైదరాబాద్‌లోని సీసీఎంబీ(సెంటర్ ఫర్ సెల్యులర్ మోలుక్యూలర్ బయోలజీ)ని సందర్శించే అవకాశం లభించింది. గైడ్ టీచర్‌తోపాటు విద్యార్థిని సీసీఎంబీని సందర్శించారు.

ఎన్‌సీసీలో బంగారు పతకం



పొన్కల్ పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది వందమంది వరకు ఎన్‌సీసీ కేడెట్లుగా తయారవుతున్నారు. ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ అలవర్చుకుంటున్నారు. ఇందులో ప్రతిభ కనబర్చి ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధిస్తున్నారు. శ్లేష అనే విద్యార్థిని ఎన్‌సీసీలో బంగారుపతకం గెలుచుకుని ఈ ఏడాది ట్రిపుల్‌ఐటీలో ఎన్‌సీసీ విభాగంలో సీటు పొందింది.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న తెలంగాణ ఉద్యోగ జేఏసీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రస్తుత సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జేఏసీ నాయకులు కోరారు. పెన్షన్ విమోచన దినం పురస్కరించుకుని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానం ఉద్యోగుల భవిష్యత్తును దెబ్బతీస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ వెల్మ ప్రభాకర్, సెక్రెటరీ జనరల్ డాక్టర్ పీజీ.రెడ్డి, జేఏసీ నాయకులు గొజ్జ జనార్దన్, ఏ.విజయ్‌కుమార్, రవికుమార్, అశోక్, సత్యపాల్‌రెడ్డి, జె.లక్ష్మణ్, తోడిశెట్టి రవికాంత్, దాసరి శంకర్, పెంట అశోక్, గణేశ్, రవి, మసియొద్దీన్, వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్థానిక జుమ్మెరాత్ పేట్ పాఠశాల టీచర్లు నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం దత్తురాం, సీపీఎస్ సంఘ నాయకుడు బోస్లే గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనతంరం తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఖానాపూర్: ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాహెద్‌ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉన్నారు.

లోకేశ్వరం: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అబ్బడి మురళీమనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజూర ఉన్నత పాఠశాలలో సోమవారం టీజీజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1 పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టీటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, పీఆర్టీయూ నాయకులు రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్ మహాధర్నాకు బయల్దేరిన పీఆర్టీయూ నేతలు

లోకేశ్వరం: హైదరాబాద్‌లో సోమవారం తలపెట్టిన సీపీఎస్ మహా ధర్నాకు పీఆర్టీయూ నాయకులు నల్లడ్రెస్సులు ధరించి వాహనంలో వెళ్లారు. నాయకులు రాజేందర్, రాజారాం, సురేష్‌రావు, దేవేందర్, అశోక్, శ్రీనివాస్, ధనుంజయ్, రాజు ఉన్నారు.

కౌన్సెలింగ్ తర్వాతే సర్దుబాటు చేయాలి



మాట్లాడుతున్న రవికాంత్

నిర్మల్ రూరల్: ఇటీవల చేపట్టిన పదోన్నతులతో మిగిలిపోయిన పోస్టులకు లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు తోడిశెట్టి రవికాంత్, ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈనెల 4వ తేదీ లోపు సర్దుబాటును పూర్తిచేయాలనే ప్రభుత్వ ఉత్తర్వులు ఉపసంహరించాలని సూచించారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో వివిధ కేటగిరీల్లో 1:3 నిష్పత్తిలో కాకుండా 1:1 నిష్పత్తిలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా చాలామంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందిన పాఠశాలలో జాయిన్ కాలేదన్నారు. ఈ స్థానాలను గతేడాది జరిగిన బదిలీలు పదోన్నతుల్లో లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ కౌన్సెలింగ్ నిర్వహించి ప్రస్తుతం ఈ విధానాన్ని కొనసాగించకపోవడం సరికాదన్నారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకాశ్

భైంసాటౌన్: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకాశ్ సోమవారం తనిఖీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యార్థులు జ్వరాలు, సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశముందని, ఈ నేపథ్యంలో పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు పాఠశాలలో సరుకులు, కూరగాయలు పరిశీలించారు. వంటగది ఆవరణ శుభ్రంగా ఉంచాలని సూచించారు. వైద్యులు కమలేశ్, సీహెచ్‌ఓ గంగాధర్, వైద్య సిబ్బంది, పాఠశాల ఎస్‌ఓ జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆశవర్కర్ల ముందస్తు అరెస్ట్



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆశవర్కర్లు

నిర్మల్‌టౌన్: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన చలో హైదరాబాద్ పర్యటనను పోలీసులు అడ్డుకుని వారిని ముందస్తుగా స్థానిక బస్టాండ్ వద్ద సోమవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదన్నారు. చంద్రకళ, భాగ్యలక్ష్మి, లావణ్య, రామలక్ష్మి, సులోచన, విజయ, శారద, సరిత, సుజాత, ప్రతిభ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఏఎస్పీని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నిర్మల్ ఏఎస్పీ రాజేష్‌మీనా అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్ పంచాయతీ పరిధిలో గల పాత దిలావర్‌పూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన కర్ర వినాయకున్ని సోమవారం దర్శించుకున్నారు. కర్ర వినాయకున్ని ప్రతిష్ఠించిన గ్రామస్తులను ఏఎస్పీ అభినందించారు. గ్రామస్తులు ఏఎస్పీ తోపాటు సీఐ అజయ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్‌ను సన్మానించారు. అంతకముందు పట్టణంలోని బజరంగ్‌దళ్‌తోపాటు పలు వినాయక మండపాలను సందర్శించి పూజలు చేశారు. నాయకులు కిషన్ రెడ్డి, నర్సయ్య, గంగాధర్ గౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీపతి గౌడ్, రమేష్, వాసన్, ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్వర్ ఉన్నారు.

భారీ వరదలకు పంటలు నష్టం

- చేలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



కుంబిలో పంట పొలంలో ఇసుకమేటలు



దస్తురాబాద్ మండలం రాంపూర్‌లో మునిగిన పంటలు

భైంసారూరల్: గడ్డెన్నవాగు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో కుంబి గ్రామంలో పంట పొలాలు ఇసుకమేటలతో కనిపిస్తున్నాయి. ముంచెత్తిన వరద నీరు పంటలను నాశనం చేసింది. ఇసుక మేటలు వేసిన పొలాలు రైతులకు గుండెకోత మిగిల్చింది. ఇటు సిరాల, ఇలేగాం, పేండ్‌పెల్లి, కామోల్, కథ్‌గాం తోపాటు సుద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

బాసర: బాసరలో వరద బాధితులను కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలాచారి సోమవారం పరామర్శించారు. వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. అంతకుముందు సరస్వతి అమ్మవారి దర్శనం అనంతరం మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, మాజీ సర్పంచ్ ఎం.రమేశ్, సంజీవరావు నాయకులు ఉన్నారు. బాసరలోని పంటలను ఏఈవో అజయ్‌కుమార్ పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ సభ్యుడు కోమ్రేవార్ కిరణ్ కోరారు. నాయకులు కోర్వా శ్యామ్, నూకం రామారావు, సదానంద్, శ్రీనివాస్ పోశెట్టి నాగరాజు ఉన్నారు.

ముధోల్: మండలంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ధ్వంసమైన రోడ్లను కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ సోమవారం పరిశీలించారు. మండల కేంద్రంలో కొట్టుకుపోయిన ముధోల్ నుంచి ధర్మాబాద్‌కు వెళ్లే రోడ్డును పరిశీలించారు. నాయకులు మమ్మాయి రమేష్, వినోద్‌రెడ్డి, నజీమ్, నర్సింహారెడ్డి, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. ముధోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో కురిసిన భారీ వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తమను ఆదుకోవాలని కోరుతూ రైతులు సోమవారం తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు.

లోకేశ్వరం: వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రాజూర, బాగాపూర్ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సర్ఫరాజ్ నవాబ్‌కు వినతిపత్రం అందజేశారు. అధిక వానలకు రాజూర గ్రామంలోని గోయింద్ చెరువు నీటికి 150 ఎకరాల్లో పట్టాభూముల్లో నీరు చేరడంతో పంటలు దెబ్బతిన్నాయి. మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, భోజన్న ఉన్నారు.

తానూరు: తొండల, జౌలా(కే), బోల్సా, మహలింగి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌రావ్ పటేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండలిక్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: పుస్పూర్, సాథ్‌గాం గ్రామాల్లో భైంసా గడ్డెవాగు ప్రాజెక్టు ఉధృతికి నష్టపోయిన పంటలను ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు శ్యాంసుందర్, దిగంబర్, ప్రశాంత్, అనిల్, భోజారాం పటేల్, భోజన్న, దిగంబర్ ఉన్నారు.



బాసర: పంటను పరిశీలిస్తున్న వేణుగోపాలాచారి, నారాయణరావు పటేల్

ఖానాపూర్: వర్షాలకు బావాపూర్(కె) గ్రామంలో నీటమునిగిన ఆయిల్‌పామ్ పంటలను ఉద్యాన అధికారి స్పందన సోమవారం పరిశీలించారు. నీట మునిగిన తోటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టి వరద నీరు వెళ్లిపోయాక బావిస్టిన్ 2 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. సీవో దినేష్, ఏఈవో రజిత, రైతులు నర్సయ్య ఉన్నారు.

దస్తురాబాద్: కడెం ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి తీర ప్రాంతాలైన గోడిసీర్యాల, మున్యాల, దేవునిగూడెం, భూత్కూర్ గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. మళ్లీ వర్షాలు కురవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ముధోల్: పరిశీలిస్తున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్



తానూరు: జౌలా(కే)లో పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్



లోకేశ్వరం: సాథ్‌గాంలో పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ శ్యాంసుందర్

అనర్హులను తొలగించాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ఖానాపూర్: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోని అనర్హులను తొలగించాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బాధిత పేదలతో కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ప్రజావాణికి తరలివెళ్లి.. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్, బహుజన కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకన్న మాట్లాడారు.డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయన్నారు. అనర్హుల జాబితాతో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సమగ్ర విచారణ చేసి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డబుల్ బెడ్‌రూమ్ సాధన కమిటీ సభ్యులు తోట రాధ, గౌస్, పద్మ, మాజిద్ పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



కుంటాల: నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థినులు

కుంటాల: మండలంలోని కల్లూరు కేజీబీవీలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు భక్తి పాటలకు నృత్యాలు చేస్తూ స్థానిక వాగులో నిమజ్జనం చేశారు. ఎస్‌ఓ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేశ్ లడ్డూ @ రూ.25,150

ముధోల్: మండలంలోని ఆష్టా గ్రామంలో సోమవారం గణేశ్ లడ్డూ వేలం పాట నిర్వహించారు. రూ. 25150కి లడ్డూను గ్రామానికి చెందిన బొడ్డు గంగారెడ్డి దక్కించుకున్నారు. నిర్వాహకులు ఆయనున సన్మానించి లడ్డూ అందజేశారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యలకు పూజలు

తానూరు: భోసి గ్రామంలో నెలకొల్పిన కర్ర గణేశుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలం నుంచే కాక మహారాష్ట్రలోని నాందేడ్, భోకర్, ధర్మబాద్ నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన హోమంలో దంపతులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయ ప్రాంగణంలో శ్రీవరసిద్ధి గణేశ్(కర్రగణేశ్) మండపం వద్ద ఆదివారం రాత్రి శ్రీశార్వాణి సంగీత నృత్యానికేతన్ భైంసా కళాకారుల నృత్య కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నిజామాబాద్ నుంచి వచ్చిన గాయని సీతక్క(హోంగార్డు) పాడిన భక్తి, జానపద పాటలు అలరించాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలో రామ్‌సేన యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్సై సాయికుమార్, యువకులు పాలొన్నారు. మున్యాల, రేవోజీపేట, దస్తురాబాద్ గ్రామాల్లోని గణేశ్ మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. మున్యాల హనుమాన్ గణేష్ మండపం వద్ద తహసీల్దార్ విశ్వంబర్, కాంగ్రెస్ నాయకురాలు సుగుణక్క పాల్గొని పూజలు చేసి, అన్నదానంలో పాల్గొన్నారు.